News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :226 | ఖమ్మం | ఆదివారం, సెప్టెంబర్ 20, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## ఎర్రవల్లి భూముల సర్వేలో
# మరో ట్విస్ట్



- 180 ఎకరాలు మావేనంటున్న రైతులు!
- ఎర్రవల్లి 325 సర్వే నంబర్‌పై కొనసాగుతున్న పరిశీలన
- మొత్తం 388 ఎకరాల భూములపై అధికారుల సర్వే
- 180 ఎకరాలు తమవేనంటున్న వెంకటాపూర్ రైతులు
- పాత ఖాస్రా, సేత్వార్ రికార్డులు పరిశీలించాలని డిమాండ్
- ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ హద్దుల పరిశీలన
- రైతులకు నోటీసుల తర్వాత ఎంజాయ్‌మెంట్ సర్వే



## బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం

- 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు'
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ
- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ
- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా

## కొత్త గేట్‌వే
# విమానాశ్రయం

- వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోంది
- బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయింది
- వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు సూచించాలన్న రేవంత్ రెడ్డి
- రెండు పేర్లను సూచించిన సందీప్‌రెడ్డి వంగా
- వరంగల్ మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని రేవంత్‌రెడ్డి కోరారు
- విమానాశ్రయానికి తాను రెండు పేర్లను సూచించాలనుకుంటున్నానని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెలిపారు.



హైదరాబాద్
వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరుగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల

వివరాలు 2లో..




## దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీ

- విద్యార్థులు ప్రశ్నించడం ఆ సిస్టమ్‌కు ఇష్టం లేదు
- ఆ ఆరుగురే వ్యవస్థను నడిపిస్తున్నారు
- ఛాత్రోం కీ గూంజ్ ప్రచారంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- దేశమంతా ఒక వ్యవస్థ చేతిలో బందీగా ఉందని ఆరోపణలు
- విద్యార్థులు ప్రశ్నిస్తున్నందుకు ఆ సిస్టమ్ వారిని భయపెడుతోందన్న కాంగ్రెస్ నేత

## యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!

- తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోం
- నగదు మాత్రమే తీసుకుంటాం
- రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే






## 20ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది

- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దోభాల్
- దేశం అద్భుతమైన భవిష్యత్తు వైపు అడుగులేస్తోందని వెల్లడి
- 2047 వరకు ఉన్న సమయం నిజమైన 'అమృత కాలం' అని వ్యాఖ్య



## నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ

- ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం!
- దేశాన్ని వీడుతున్న నైరుతి రుతుపవనాలు
- సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమనం ప్రారంభం
- ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఐఎండీ ప్రకటన

## వ్యవసాయ రంగంలో
# అనూహ్య మార్పులు



- తెలంగాణపై సూపర్ ఎల్‌నినో ప్రభావం
- తెలంగాణ వ్యవసాయ రంగంపై సూపర్ ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపబోతోంది
- సాగు, దిగుబడులు భారీగా తగ్గనున్నాయి
- ఖరీఫ్ సీజన్ గణాంకాలు భవిష్యత్తు సాగు పద్ధతులకు పాఠంగా నిలుస్తున్నాయని చెప్పవచ్చు

హైదరాబాద్
తెలంగాణలో ప్రధాన ఆహార పంట వరిపై సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపబోతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట, సాగు, విస్తీర్ణం దిగుబడులు గణనీయంగా తగ్గిపోతుండటం రైతుల్లో సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖలు, పౌరసరఫరాల శాఖ గణాంకాల ప్రకారం, గత సంవత్సరం వానాకాలంతో పోలిస్తే ఈసారి ఖరీఫ్ వరిసాగు విస్తీర్ణం 10 లక్షల ఎకరాలకుపైగా పడిపోయింది. 2025-26 ఖరీఫ్?లో తెలంగాణ ఆల్?టైం రికార్డుగా 67.57 లక్షల ఎకరాల్లో 148.3 లక్షల టన్నులు ఉత్పత్తి లభించింది. 2025-26 వానాకాలంలో 55 లక్షల 89 వేల 862 ఎకరాల్లో సాగై, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికార వర్గాలు అంచనా వేశాయి.

వివరాలు 2లో..



## టీఎంసీ పేరు, గుర్తు వివాదం.. ఈసీ నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమత

- బెంగాల్ ఉపఎన్నికల్లో టీఎంసీ పేరు, గుర్తు వాడొద్దన్న ఈసీ
- ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ పిటిషన్
- పార్టీ గుర్తింపు కోల్పోవడం బాధాకరం

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్
# నిధులు పక్కదారి

- పలు విద్యాసంస్థలపై విజిలెన్స్ తనిఖీలు
- రాజధాని నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు
- బోగస్ అడ్మిషన్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణ
- నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల సోదాలు

# వ్యవసాయ రంగంలో అనూహ్య మార్పులు

-మొదటిపేజీ తరువాయి

### భారీగా పడిపోనున్న దిగుబడులు

వాతావరణ మార్పుల నేపథ్యంలో తెలంగాణ వ్యవసాయ రంగంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. సూపర్ ఎన్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో లోటు వర్షపాతం కారణంగా వరి పంట సాగు విస్తీర్ణం అంచనాలు తలకిందులు చేస్తూ దిగుబడులు భారీగా పడిపోనున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం కోటి 32 లక్షల 38 వేల 446 ఎకరాలు నిర్దేశించగా, ప్రతికూల వాతావరణ పరిస్థితులు దృష్ట్యా కోటి 24 లక్షల 90 వేల 516 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతోన్నాయి. అంటే ప్రభుత్వం, వ్యవసాయ శాఖ నిర్దేశించిన లక్ష్యంలో 94 శాతం మేర వ్యవసాయ పంటలు సాగవుతోన్నాయి. గత ఏడాది వానాకాలంతో పోలిస్తే ఈ సీజన్‌లో 6 శాతం విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రధాన ఆహార పంట వరి తీసుకుంటే సాధారణ సాగు విస్తీర్ణం 65 లక్షల 95 వేల 645 ఎకరాలు ఉండగా, 55 లక్షల 89 వేల 862 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. అంటే 85 శాతానికి వరి పరిమితమైంది. అదే గత ఏడాది ఖరీఫ్ కాలంలో మాత్రం లక్ష్యానికి మించి 66 లక్షల 74 వేల 798 ఎకరాల్లో రికార్డు స్థాయిలో సాగైంది.

తాజా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 10 లక్షల 5 వేల 783 ఎకరాలు విస్తీర్ణం వరి సాగు తగ్గిపోయింది. ఈ వానాకాలంలో సానుకూల వాతావరణ పరిస్థితులు పూర్తిగా లేకపోవడంతో 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి మాత్రమే వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 45 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం, 20 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కలిపి మొత్తం 65 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.

### వచ్చే నెల నుంచి ధాన్యం కొనుగోళ్లు

అక్టోబర్ 15 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో అక్టోబర్ 1 నాటికే అన్ని కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కేంద్రాలు, ఇతర కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని భావిస్తోంది. మొత్తంగా 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ కోసం సన్నద్ధమవుతోంది.

కేంద్రం గ్రేడ్--ఏ రకం ధాన్యం ధర క్వింటా రూ.2,461, సాధారణ రకం ధాన్యం రూ.2,441 చొప్పున కనీస మద్దతు ధర నిర్ణయించింది. ఈసారి రూ.18,250 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ కార్యాచరణ అమలుచేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు



సమీక్షిస్తున్న తరుణంలో సూపర్ ఎల్?నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావం, కరవు పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో వరి పంట దిగుబడులు 20 శాతం వరకు పడిపోయే అవకాశం కనిపిస్తుందని మార్కెటింగ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### కారణాలు ఇవేనా?

తెలంగాణ వ్యవసాయ శాఖ తొలుత విడుదల చేసిన అంచనాల ప్రకారం 65 లక్షలకుపైగా ఎకరాల విస్తీర్ణంలో వరి సాగుచేయాల్సి ఉన్నప్పటికీ, నిర్దేశిత లక్ష్యానికి భిన్నంగా ఈసారి 10 లక్షల ఎకరాలకుపైగా విస్తీర్ణం తగ్గిపోయింది. గత ఏడాది వానాకాలం సెప్టెంబర్ నాటికి వరిసాగు విస్తీర్ణం 66 లక్షల ఎకరాలు దాటింది. కానీ, ఈసారి సాగు విస్తీర్ణం 55.89 లక్షల ఎకరాలకు పరిమితం అయింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టిసారించడం ఈ భారీ తగ్గుదలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. 2025-26 ఖరీఫ్ సీజన్? చివర్లో అనూహ్యంగా 148.3 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి సాధించి రికార్డు సృష్టించింది. 2024 సంవత్సరం జాతీయంగా ఖరీఫ్ వరి 122.77 మిలియన్ టన్నులు నుంచి 2025 ఖరీఫ్ పంట కాలం వరకు 124.5 మిలియన్ టన్నులు పెరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత తెలంగాణలో ఏటా వరి పంట సాగు పెరగడంతోపాటు దిగుబడులు కూడా పెరుగుతూ వచ్చాయి. 2019-20 ఖరీఫ్ పంట కాలంలో 72 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి లభించింది. 2024-25 ఖరీఫ్ కాలంలో 135 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా సాధారణం కంటే 15 శాతం తక్కువ వర్షం వర్షపాతం నమోదైంది. కొన్ని రాష్ట్రాల్లో 42 శాతం లోటు ఏర్పడింది.

### ఈ జిల్లాల్లో కరవు పరిస్థితులు

తెలంగాణలో ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట తదితర జిల్లాల్లో కరవు ఛాయలు నెలకొన్నాయి. కృష్ణా, గోదావరి నదుల పరివాహక ప్రాంతాల్లో ప్రధాన జలాశయాలు, నీటి వనరుల్లో ఆశించిన నీటి మట్టాలు లేకపోవడం, ఎగువ రాష్ట్రాల్లో ఆశించిన వర్షాలు కురిసినప్పటికీ వరద నీరు పెద్దగా వచ్చి చేరలేదు. యూరియా కొరత, ఎరువుల యాప్ నిర్వహణ ఇబ్బందులు, రైతుల్లో అవగాహన లేమి వంటి కారణాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతిదారుగా భారత్? ఉంది. ఉత్పత్తి తగ్గితే ఎగుమతి ధరలు పెరుగుతాయి. ఇప్పటికే ఏడాది గరిష్ఠంగా బియ్యం ధరలు చేరడంతో వినియోగదారుల్లో సర్వత్రా నిరసన, ఆందోళన వ్యక్తమవుతోంది. చిల్లర మార్కెట్లో ప్రీమియం బియ్యం సాంబమసూరి, తెలంగాణ సోనా, జై శ్రీరామ్, హెచ్ఎంటీ వంటి సన్న రకాలు రూ.80-100 వరకు పలుకుతున్నాయి. సాధారణ బియ్యం 2014 రిటైల్?లో కిలో రూ.25 గా ఉంటే, ఇప్పుడు రూ.55 - రూ.70 గా ఉంది. సూపర్ ఎల్?నినో నేపథ్యంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల నడుమ కష్టకాలంలో నష్టపోకుండా ఉండేందుకు రైతులు తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర వ్యవసాయ తీరుతెన్నులు పూర్తిగా మార్చివేసింది. తాజా ఖరీఫ్ సీజన్ గణాంకాలు భవిష్యత్తు సాగు పద్ధతులకు పాఠంగా నిలుస్తున్నాయని చెప్పవచ్చు.

# 70 రూపాయిలకు చేరిన ఉల్లి

**హైదరాబాద్ :** రెండు నెలల క్రితం వంద రూపాయలకు ఐదు కిలోల చొప్పున ఉల్లిపాయలను విక్రయించారు. ట్రాలీ ఆటోల మీద వీధి వీధి తిరిగి మరీ సరసమైన ధరలకే ప్రయివేట్ వ్యక్తులు ఉల్లిపాయలను విక్రయించారు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అవే ట్రాలీ ఆటోల మీద కిలో రూ.70 చొప్పన విక్రయిస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే ఉల్లి ధర త్వరలోనే సెంచరీకి చేరువయ్యేలా ఉంది. ఉల్లి ధరల ఇంతలా పెరగడానికి కారణమేంటి? వంటల్లో ఉల్లికి ప్రత్యామ్నాయమేంటో చూద్దాం.వంటింట్లో అత్యవసరమైన ఉల్లిపాయ ధరలు గత కొంత కాలంగా భారీగా పెరుగుతున్నాయి. రిటైల్ మార్కెట్లో ఉల్లిపాయల ధర కిలో రూ.70కి చేరుకుంది. పంట దిగుబడి తగ్గడం, మార్కెట్లో సరఫరా తగ్గడంతో ఉల్లి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. జులై వరకు హైదరాబాద్‌లో రూ.100కు 4 లేదా 5 కిలోల ఉల్లిపాయలను రోడ్ల పక్కన ట్రాలీ ఆటోల్లో ఉంచి విక్రయించేవారు. కానీ ఇప్పుడు అదే చోట, అదే ట్రాలీ వాహనాల్లో కనిష్టంగా రూ.200కు 3 కిలోల చొప్పన విక్రయిస్తున్నారు. ఈ చొప్పన చూస్తే ఉల్లి ధరలు ఒక్కటెండు నెలల్లోనే ఎంతా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు.ఏపీ ప్రభుత్వం ఉల్లి ధరల భారం సామాన్యుడిపై పడకుండా చూడటం కోసం రైతు బజార్లలో రూ.35 కిలో చొప్పన విక్రయించే ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం ధరల స్థిరీకరణ నిధి ద్వారా 1 లక్షా 21 వేల టన్నుల బఫర్ స్టాక్‌ను మార్కెట్లోకి రిలీజ్ చేస్తోంది. అయితే ఇవి అందరికీ చేరడం లేదు. మరోవైపు వ్యాపారులు కృతిమ కొరతను సృష్టించి పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉల్లి ధరల సెగ తగులుతోంది.హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్లో క్వింటాల్ ఉల్లి రూ.5500 వరకు పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి



మాత్రమే ఉల్లి సరఫరా అవుతోంది. రోజుకు 5-6 వేల క్వింటాళ్ల వరకు విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో మలక్‌పేట మార్కెట్‌కు గరిష్టంగా 8 వేల క్వింటాళ్ల వరకు ఉల్లిపాయలు వస్తుంటాయి. సీజన్లో రోజుకు 12 వేల టన్నుల నుంచి 15 వేల టన్నుల ఉల్లిపాయలు వచ్చే సందర్భాలు కూడా ఉంటాయి.ఉల్లి దిగుబడి ఎక్కువగా వస్తే రైతుకు గిట్టుబాటు ధర అందడం లేదు. దిగుబడి తగ్గితే ధరలు పెరిగి సామాన్యులపై భారం పడుతోంది. గత ఏడాది అక్టోబర్‌లో ఏపీలోని తాడేపల్లిగూడెం మార్కెట్లో కడప జిల్లా నుంచి వచ్చిన ఉల్లి పంటను కిలో కేవలం రూ.5-10 చొప్పన కొనుగోలు చేశారు.ఉల్లి ధరలు పెరగడానికి పంట దిగుబడి తగ్గడంతోపాటు.. సరైన పంట నిల్వ సదుపాయాలు లేకపోవడం కూడా కారణమే. కోల్ట్ స్టోరేజీ సదుపాయాలు లేకపోవడంతో తేమ కారణంగా నిల్వ చేసిన ఉల్లిపాయల్లో 30 శాతానికిపైగా కుళ్లిపోయే అవకాశం ఉంది. దీని వల్ల పంట వృథా అవుతోంది. రవాణా ఛార్జీలు, అక్రమ నిల్వలు, పాత పంట నిల్వలు అయిపోయి కొత్త పంట మార్కెట్‌కు రాకపోవడం, అంతర్జాతీయ డిమాండ్ లాంటి అంశాలు కూడా ఉల్లి ధరలు పెరగడానికి కారణం అవుతాయి.

## వరంగల్ నుంచి కరీంనగర్‌కు ఇకపై 40 నిమిషాల్లోనే వెళ్లొచ్చు!



ఇప్పటి వరకు 72 కిలోమీటర్ల దూరం 2 వరసల మార్గం, గంటన్నర సమయం, ఎన్నో సమస్యల మధ్య ప్రయాణం. కట్ చేస్తే ప్రస్తుతం 68 కిలోమీటర్లకు తగ్గిన దూరం, 4 లేన్లతో మార్గం, 40 నిమిషాలే ప్రయాణ సమయం! కీలక నగరాలైన వరంగల్-కరీంనగర్ మధ్య నిర్మించిన జాతీయ రహదారి 563 ప్రత్యేకతలు ఇవి. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముస్తాబవుతున్న ఈ నేషనల్ హైవే త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఫలితంగా రెండు నగరాల మధ్య ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాల రాకపోకలు సాగనున్నాయి. మరి ఈ హైవేలో ఇంకా ఎలాంటి ప్రత్యేకతలు ఉన్నాయి? రహదారి భద్రతా ప్రమాణాలు ఏ మేరకు అమలు చేయనున్నారో పూర్తి వివరాలు తెలుసుకుందాం.

### అత్యాధునిక రవాణా వ్యవస్థల ఏర్పాటు

రాష్ట్రంలో సూపర్ ఫాస్ట్ వేగంతో ప్రయాణించే మరో జాతీయ రహదారి త్వరలోనే అందుబాటులోకి రానుంది. వరంగల్-కరీంనగర్ మధ్య కొత్తగా నిర్మించిన ఎన్?హెచ్-563 రహదారిపై త్వరలోనే వాహనాలు పరుగులు పెట్టనున్నాయి. భారతమాల పరియోజన పథకం కింద జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్?హెచ్?ఏఐ) దాదాపు 1,647 కోట్లతో 68 కిలోమీటర్ల జాతీయ రహదారిని నిర్మించింది. రహదారి భద్రతకు పెద్దపీట వేసేలా అత్యాధునిక సౌకర్యాలతో రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఈ జాతీయ రహదారి వెంట సీసీ కెమెరాలు, సోలార్ ప్యానెళ్లు, సమాచారం అందించే క్యూఆర్ కోడ్‌లు, వీడియో ఇన్సిడెంట్ డిటెక్షన్ సిస్టమ్, ఆటోమేటిక్ చలాన్ సిస్టమ్ వంటి అత్యాధునిక రవాణ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. ఏడు మండలాల పరిధిలో మొత్తం 30 గ్రామాల గుండా రహదారి సాగుతుంది. ఆయా ప్రాంతాల్లో మొత్తం సుమారు 56 కిలోమీటర్ల సర్వీస్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తి చేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పనిచేసే అడ్వాన్స్?డ్ ట్రాఫిక్ మేనేజ్?మెంట్ సిస్టమ్ (ఏటీఎమ్ఎస్) విధానాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా రహదారిపై ఉండే సీసీ కెమెరాలు 360 డిగ్రీల్లో నిఘా ఉంచుతూ ఎక్కడైనా వాహనాలు ఆగినా, ప్రమాదం జరిగినా వెంటనే కంట్రోల్? రూమ్‌కు సమాచారం అందిస్తాయి. ఒకవేళ ప్రమాదం జరిగితే వెంటనే అక్కడికి అంబులెన్స్, క్రేన్‌లను పంపించేలా సదుపాయం కల్పించారు. "నాలుగు వరుసలు, 68కిలోమీటర్ల పొడవుతో నిర్మితమవుతున్న వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారి-563ని రూ.1,647 కోట్లతో నిర్మిస్తున్నాం.

## కొత్త గేట్‌వే విమానాశ్రయం

-మొదటిపేజీ తరువాయి

అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.

ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

### రెండు పేర్లను సూచించిన సందీప్ రెడ్డి వంగా

సొంతూరు వరంగల్‌కు అంతర్జాతీయ విమానాశ్రయం రావడం ఎంతో సంతోషంగా ఉందని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెలిపారు. విమానాశ్రయానికి తాను రెండు పేర్లను సూచించాలనుకుంటున్నానని అన్నారు. "రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ అని సూచించారు. విమానాశ్రయానికి వరంగల్ ఘనమైన వారసత్వాన్ని, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించే పేరును పెట్టడం నిజంగా ఎంతో అర్థవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు కృషి చేసి, విమానాశ్రయం కలను వాస్తవంలోకి తెచ్చిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

### పర్యావరణ అనుమతులే ఆలస్యం

రేవంత్ రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లిన సందర్భంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయ్యారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో సమీక్ష చేశారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే ఏఏఐ అధికారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు సమర్పించిన నేపథ్యంలో త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

## ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్..

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలోని ప్రభుత్వ భూముల సర్వేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల భూమిపై రెవెన్యూ, సర్వే అధికారులు చేపట్టిన సర్వే మూడో రోజుకు చేరుకోగా, ఈ వివాదంలోకి పొరుగున ఉన్న వెంకటాపూర్ గ్రామస్థులు ప్రవేశించారు. సర్వే చేస్తున్న భూమిలో తమ వాటా కూడా ఉందని వారు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. వివరాల్లోకి వెళితే, సర్వే నంబర్ 325 కింద ఉన్న మొత్తం 388 ఎకరాల భూమిలో కేవలం 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లికి చెందినవని, మిగిలిన సుమారు 180 ఎకరాలు తమ వెంకటాపూర్ గ్రామ పరిధిలోకి వస్తాయని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు పొరపాటున తమ గ్రామ పరిధిలోని భూమిని ఎర్రవల్లి సర్వే నంబర్‌లో కలిపారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఖస్రా, సేత్వార్ పహాణీ వంటి పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వేను పక్కాగా నిర్వహించి, తమ భూమిని గుర్తించి వేరు చేయాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, అధికారులు తమ సర్వే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ భూమిని ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులను గుర్తించే పనిలో భాగంగా వారికి నోటీసులు జారీ చేయడం ప్రారంభించారు. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, శనివారం ఒక్కరోజే సుమారు 50 మందికి నోటీసులు అందజేశారు. నిర్దేశిత తేదీల్లో రైతులు తమ భూముల వద్దకు వచ్చి, సంబంధిత వివరాలు అందించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి నాలుగు దశల్లో సర్వేను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయ్యాక, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం భూమిని సాగు చేస్తున్న, అనుభవంలో ఉన్న రైతులను గుర్తించేందుకు 'ఎంజాయ్‌మెంట్ సర్వే' కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అయితే, వెంకటాపూర్ గ్రామస్థుల వాదనతో ఈ సర్వే ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. రెండు గ్రామాల మధ్య నెలకొన్న ఈ సరిహద్దు వివాదాన్ని అధికారులు ఎలా పరిష్కరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి

హైదరాబాద్ నగరంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలతో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణలున్నాయి. దీంతో బయోమెట్రిక్, సిబ్బంది వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పలు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో ఈ రోజు ఉదయం నుంచి అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ఈ తనిఖీల్లో విద్యార్థుల వాస్తవ సంఖ్య, కళాశాల రికార్డులు, ప్రవేశాల వివరాలు, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన డేటా తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## జన్వాడ ఫాంహౌస్.. నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే: కాంగ్రెస్ ఎంపీలు

**జన్వాడ ఫాంహౌస్ ను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీలు**

**ఈ ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవన్న ఎంపీ చామల**

**అసలు యజమాని ఎవరనే దానిపై అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్య**



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను (కేటీఆర్ ఫాంహౌస్ గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం ఈరోజు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన ఈ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారని, శతభిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్తగారి పేరిట కూడా భూములు ఉన్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

# త్వరలోనే ఐటీ టవర్ ప్రారంభం -- జిల్లా యువతకు భారీగా ఉపాధి అవకాశాలు

- 2,000 మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు
- ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 3 ప్రముఖ ఐటీ కంపెనీలు
- నూతన ఐటీ టవర్‌ను పరిశీలించిన డిసిసి అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్



ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సమీపంలోని బట్టి సావర్గాం గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన ఐటీ టవర్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని, త్వరలోనే దీనిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి చేతుల మీదుగా వైభవంగా ప్రారంభించనున్నట్లు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు (ఐజజ) డాక్టర్ నరేష్ జాదవ్ గారు వెల్లడించారు.
శనివారం రోజున జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి ఆయన బట్టి సావర్గాం వద్ద ఉన్న ఐటీ టవర్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. భవన నిర్మాణం, అంతర్గత సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా యువతకు స్థానికంగానే ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ఐటీ టవర్‌ను సకల సౌకర్యాలతో నిర్మించడం జరిగింది. జి౦4 (+౦4) అంతస్తులలో రూపుదిద్దుకున్న ఈ భవనంలో 2,000 మంది ఐటీ నిపుణులు, యువత పనిచేసుకునేలా విశాలమైన వసతులు కల్పించాము.""ఈ ప్రాంతంలో ఐటీ విస్తరణకు కంపెనీలు సానుకూలంగా ఉన్నాయి. ఇప్పటికే మూడు ప్రముఖ కంపెనీలు ఇక్కడ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు, స్థలం కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. మరిన్ని కంపెనీలు ఆదిలాబాద్ వైపు చూస్తున్నాయి. గతంలో ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు మన ఆదిలాబాద్‌లోనే అవకాశాలు అందుబాటులోకి రావడం శుభపరిణామం" అని హర్షం వ్యక్తం చేశారు.
అతిత్వరలోనే రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి సమయం తీసుకుని, ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేస్తామని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారూ , మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత గారూ, మాజీ డీసీసీ సాజీద్ ఖాన్ గారూ,మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి గారూ, టిపిసిసి ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్ గారు, జిల్లా ఓబీసీ విభాగం అధ్యక్షులు అంబకంటి అశోక్ గారు, రాష్ట్ర గిరిజన విభాగం ఉపాధ్యక్షులు ఆనందరావు గారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషాగారు,ఆదిలాబాద్ రూరల్ మండలం అధ్యక్షుడు వెంకట్ యాదవ్ గారు, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు గారు, కాంగ్రెస్ నాయకులు రుక్మా రెడ్డి గారు కుంట ప్రవీణ్ రెడ్డి గారు, అంకత్ రవి గారు, డేరా కృష్ణారెడ్డి గారు, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు,సెక్రటరీలు ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలు, అనుబంధ సంఘాల బాధ్యులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్సాయిగూడెంలో ఘనంగా గణేష్ అన్నదానం



సీకే న్యూస్ -- వలిగొండ మండల ప్రతినిధి బాలరాజు । సెప్టెంబర్ 19:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సాయిగూడెం గ్రామంలో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
శ్రీ మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నర్సాయిగూడెం మాజీ సర్పంచ్ తుమ్మల దామోదర్ సమక్షంలో తుమ్మల శ్రీనివాస్ దంపతులు, కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం అందించారు.
ముందుగా వేద పండితుల సమక్షంలో గణేష్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా తుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ గణేష్ మహారాజ్ ఆశీస్సులు వలిగొండ మండల ప్రజలకు, నర్సాయిగూడెం గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణేష్ మహారాజ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు.కీర్తిశేషులు తుమ్మల నరసయ్య కుటుంబ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమానికి సహకరించారు.తుమ్మల ఆనంద్, తుమ్మల సంతోష్, పసల ఇన్నయ్య, ఇన్సెంట్ జాన్ద, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.
గణేష్ మండపం వద్ద భక్తుల సందడి నెలకొనగా, అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది.

# ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



సికె న్యూస్ ప్రతినిధి ఇల్లందు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.టేకులపల్లి మండలం కొప్పురాయ గ్రామపంచాయతీ ఒడ్డుగూడెం. జిపిఎస్ స్కూల్ ఉపాధ్యాయుడు.పూనే నాగేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన శుభ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పుష్ప గుచ్ఛాలతో ఉపాధ్యాయుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూనే నాగేశ్వరావు మాట్లాడుతూ పిల్లలు మంచి మార్గంలో నడవాలి వాళ్ళకి మంచి భవిష్యత్తు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ మొక్కటి వెంకట్రావు గ్రామపంచాయతీ సర్పంచ్ చింత కళ్యాణ్. విద్యార్థి తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

# సింగిల్ విండో డైరెక్టర్ గా నూతనంగా ఎన్నికైన బత్తుల శ్రీహరిని ఘనంగా సన్మానించిన గ్రామ సర్పంచ్ జువ్వి నరసింహ

సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) సెప్టెంబర్ 19:సింగిల్ విండో డైరెక్టర్ గా నూతనంగా ఎన్నికైన బత్తుల శ్రీహరిని ధర్మోజి గూడెం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జువ్వి నరసింహ , వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్,రాచకొండ భార్గవ్,గ్రామ శాఖ అధ్యక్షులు వల్లబోతూ నారాయణ ,మాజీ ఉప సర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, సామిడి రాఘవరెడ్డి, ఐతరాజు లింగస్వామి ,ఊదరి స్వామి, డాకోజి సతీష్, ఊదరి రవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి పాఠశాలలో పచ్చదనం పరిమళించాలి



- గ్రామ సర్పంచ్ ఓబీనబోయిన లక్ష్మి అచ్చయ్య
- పాఠశాలల్లో మొక్కలు నాటి సంరక్షించాలి -- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.సెప్టెంబర్ 19 ( చింతకాని): పాతర్లపాడు గ్రామంలోని ప్రతి పాఠశాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని గ్రామ సర్పంచ్ ఓబీనబోయిన లక్ష్మి అచ్చయ్య సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనాన్ని మరింత పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. పాఠశాలల్లో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారెల్లి సురేష్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

# చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

**సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి -- పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని, సెప్టెంబర్ 19: చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. నేరాలు, నేరస్తులకు సంబంధించిన వివరాలను పోలీస్ కంప్యూటర్ వ్యవస్థలో ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. దర్యాప్తులో ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగిస్తూ, ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరచాలని ఆదేశించారు. జాతీయ నిఘా వ్యవస్థ, తెలంగాణ నేర పరిశోధన వ్యవస్థ వంటి సాంకేతిక వేదికలను దర్యాప్తులో సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో నిర్దేశిత ప్రామాణిక విధానాలను తప్పనిసరిగా పాటిస్తూ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అన్నారు. చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, రహస్య సంఖ్యల ద్వారా జరిగే మోసాలు, డిజిటల్ చెల్లింపుల మోసాలు, నకిలీ లింకులు, డిజిటల్ అరెస్టులపై ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న కేసులను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసులో దర్యాప్తు నాణ్యత, ఆధారాల సేకరణ, కేసు నమోదు వివరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, నేరస్తులపై నిఘా, ప్రజలకు భద్రత కల్పించే విషయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు.



# ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆర్థికాభివృద్ధి దిశగా పారిశ్రామికవేత్తలు ముందుకు సాగాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్:ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వ్యవస్థాపక అవగాహన, ప్రత్యేక విక్రేత అభివృద్ధి' సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు కీలక భాగస్వాములు కావాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎం ఎస్ ఎం ఈ లకు సామర్థ్యాభివృద్ధి, మార్కెటింగ్ అనుసంధానం, ప్రభుత్వ కొనుగోళ్లలో అవకాశాలు కల్పించడం, వ్యాపార రంగంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాపారాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.
ఎస్సీ, ఎస్టీ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకొని ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. స్థానిక యువతకు మరింత ప్రయోజనం చేకూరేలా త్వరలోనే ఉట్నూరులో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సంబంధిత అధికారులు, ప్రతినిధులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, ఎఫ్ సి ఐ మేనేజర్లు ఎస్. ప్రదీప్, దాసరి కృష్ణ, ప్రతినిధులు రాజేష్ కుమార్ యాదవ్, రవి వర్మ, బి. సరిత, ఎం. అశోక్, ఎల్ డి ఎం ఉత్పల్ కుమార్ దామ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పూజతోనే సంస్కృతి పరిరక్షణ: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాదు:వినాయక నవరాత్రుల సందర్భంగా శుక్రవారం భోరాజ్ మండలం రాంపూర్(టి) గ్రామంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని దర్శించుకున్న ఆయన, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం మండపంలో 2,100 దీపోత్సవ వేడుకలను మొదటి జ్యోతి వెలిగించి ప్రారంభించి, గ్రామ ప్రజలతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాంపూర్ గ్రామంలో ఇంత ఘనంగా, నిష్టతో గణేష్ ఉత్సవాలు జరగడం అభినందనీయమని కొనియాడారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం మన సంప్రదాయమని, ఇదే స్ఫూర్తిని జిల్లాలోని మిగతా గ్రామాలు సైతం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధికి యంత్రాంగం తరఫున పూర్తి సహకారం ఉంటుందని భరోసా కల్పించారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, మంచి సంకల్పంతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు సింగ్, సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, యువజన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, మహిళలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.ద

# ఎన్ హెచ్ 930 పి మరియు త్రిబుల్ ఆర్ రోడ్డులో భూమి కోల్పోతున్న రైతులు చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేత.




సీకే న్యూస్, వలిగొండ మండల ప్రతినిధి బాలరాజు, సెప్టెంబర్ 19: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంఘం గ్రామ పరిసరాల రైతులు చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.గౌరెల్లి--భద్రాచలం నేషనల్ హైవే నిర్మాణం కోసం పోచంపల్లి, వలిగొండ మండలాల్లో భూసేకరణ చేసిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోరారు.న్యాయమైన పరిహారం నిర్ణయించే వరకు తమ భూముల్లో రహదారి నిర్మాణ పనులు చేపట్టవద్దని రైతులు విజ్ఞప్తి చేశారు.దఆర్బిట్రేషన్ ద్వారా భూసేకరణ పరిహారాన్ని పునఃపరిశీలించి సముచితంగా న్యాయం ఇవ్వాలని కోరారు.ప్రస్తుతం ఎకరాకు సుమారు రూ.11 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు మాత్రమే నష్టపరిహారం అందించినారని రైతులు తెలిపారు. అదే భూములకు ఓపెన్ మార్కెట్‌లో ఎకరాకు రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు విలువ ఉందని పేర్కొన్నారు.కనీసం రూ.38 లక్షల నుంచి రూ.1.20 కోట్ల వరకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.పోచంపల్లి, వలిగొండ మండలాల భూబాధిత రైతులకు నిర్ణయించిన పరిహారాన్ని ప్రస్తుత మార్కెట్ విలువల ఆధారంగా పునఃపరిశీలించాలని కోరారు.భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన, సముచితమైన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆర్డీవోకు వివరించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కందుల తానేష్ గౌడ్ జంగారెడ్డి మహేందర్ రెడ్డి బీ జంగయ్య వెంకటరెడ్డి వలిగొండ మండలం పోచంపల్లి మండలం రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## జగన్నాధపురంలో ఘనంగా పోషణ మాసం

- పోషకాహారంపై అవగాహన కల్పించిన సర్పంచ్ తాళ్లూరి స్వప్న, సూపర్వైజర్ సంధ్యారాణి



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** జగన్నాధపురం గ్రామంలో తొమ్మిదవ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే టేక్ హోమ్ రేషన్ పోషకాహార పదార్థాలతో తయారు చేసిన వివిధ రకాల వంటకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగన్నాధపురం గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐసీడీఎస్ చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి ప్రత్యేకంగా పాల్గొని పోషణ మాసం ప్రాధాన్యతను వివరించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. గ్రామంలో పోషకాహారంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి కృషి చేస్తామని తెలిపారు.సూపర్‌వైజర్ సంధ్యారాణి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే టి హెచ్ ఆర్ ఆహార పదార్థాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో.... ఏఎన్ఎం హేమలత, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ పొల్లూరు వెంకటేశ్వరరావు,వార్డు సభ్యులు తన్నీరు రమాదేవి, అంగన్వాడి టీచర్ కాసిమాల వెంకమ్మ, ఆశ బందెల అరుణ, ఆయా యర్రమల పద్మ,కాంగ్రెస్ నాయకులు తాళ్ళూరి రమేష్,గర్భిణీలు, బాలింతలు, తల్లులు, గ్రామ ప్రజలు, పిల్లలు పాల్గొన్నారు.

## తల్లి పేరుతో మొక్కలు నాటిన శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులు...

" ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని సెప్టెంబర్ 19 :"ఏక్ పెడ్ మా కే నామ్ -- ఒక విద్యార్థి, ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా చింతకాని మండల విద్యాశాఖ అధికారి సలాది రామారావు ఆధ్వర్యంలో శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని బాధ్యతగా సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడమేనని పాఠశాల కరస్పాండెంట్ ఇ. దివాకర్ రెడ్డి విద్యార్థులకు వివరించారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని నిరంతరం సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ సభ్యులు ఇ. దివాకర్ రెడ్డి, వాహిని, తిరుపతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ తన్నీరు రామారావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి మధిర మణిహారం.

- పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం
- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం
- పండుగలు ప్రజల ఐక్యతకు, సోదరభావానికి ఎంతగానో దోహదం చేస్తాయి
- యువత ఉత్సవాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా రంగంలో ముందుకు రావాలి



**మధిర సెప్టెంబర్ 19(సికె న్యూస్)ప్రతినిధి.** మధిర: మతసామరస్యానికి మధిర పట్టణం ప్రతీకగా నిలుస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం పేర్కొన్నారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్,టీచర్స్ కాలనీల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొలువుదీరిన గణేష్ మండపాలను శనివారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ,ప్రజల మధ్య ఐక్యతను,సోదరభావాన్ని పెంపొందించేందుకు పండుగలు,ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని స్పష్టం చేశారు.మన పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని అన్నారు.అన్ని వర్గాల వారు పండుగలను సమష్టిగా, వైభవంగా నిర్వహిస్తూ ప్రజా ఐక్యతను చాటడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ వేడుకలు సమాజంలో ఆత్మీయతను,పరస్పర ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.నేటి యువత కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, సమాజహితం కోరి సామాజిక సేవా రంగాల్లో చురుగ్గా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కర్నాటి కిరణ్, రావూరి శ్రీను, 8వ వార్డ్ కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు,9వ వార్డ్ కౌన్సిలర్ వై. చారులత,రిటైర్డ్ ఎంఈఓ వై. ప్రభాకర్,పి ఆర్ టి యు నాయకుడు ఆర్ బ్రహ్మారెడ్డి,కాంగ్రెస్ నాయకులు దోర్నాల వెంకట రవి, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నంబావిలో కేటీఆర్ పర్యటనకు భారీ స్పందన

- తరలివచ్చిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాషరావు
- ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవిందు శ్రీధర్ రెడ్డి
- మాజీ జడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి
- మాజీ ఎంపిపి సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి





**సి కే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి** చిన్నంబావి మండల కేంద్రం రాజకీయ సందడితో కళకళలాడింది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చిన్నంబావి మండల కేంద్రానికి రావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కేటీఆర్ పర్యటన సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేటీఆర్‌కు ఘన స్వాగతం కేటీఆర్ పర్యటన నేపథ్యంలో చిన్నంబావి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాషరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేశారు. కేటీఆర్ రాక సందర్భంగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఒకే వేదికపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో చిన్నంబావిలో సందడి నెలకొంది. కేటీఆర్ పర్యటన సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఐక్యత, సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చకు ప్రాధాన్యం లభించింది. స్థానికంగా పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, నాయకులు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై నాయకులు దృష్టి సారించారు. కార్యకర్తల్లో ఉత్సాహం కేటీఆర్‌ను చూసేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. యువత, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. కేటీఆర్ పర్యటన పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్ని ఇచ్చిందని నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కూడా ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ కార్యకలాపాలు, నాయకుల చేరికలు, పార్టీ కార్యక్రమాలు వార్తల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇంచార్జ్ గోవిందు శ్రీధర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గజ్జె ఈదన్న యాదవ్, సీనియర్ నాయకులు కేసిరెడ్డి చిన్నారెడ్డి, సర్పంచ్ లు నరసింహ, మద్దూరి శంకర్, దివ్యశ్రీ రంజిత్ కుమార్, వడ్డేమాన్ రామకృష్ణ, తగరం ఆటో కుర్మయ్య, ఉగ్ర నరసింహ, సంకటి మద్దిలేటి, గూడెపు శివారెడ్డి, గంగేశ్వర్ గౌడ్, గుండా వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ గొల్ల బాలపీరు, వివిధ గ్రామాల మండల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మధిర మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో వినాయకుని మండపాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించిన మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు.



**మధిర సెప్టెంబర్ 19(సికె న్యూస్)ప్రతినిధి.** మధిర మొదటగా 20 వార్డులోని వినాయకుని మండపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించినారు. తరువాత సుందరయ్య నగర్ లోని ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్ మాజీ పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు మాజీ పట్టణ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు మాజీ మండలాధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు ఉమామహేశ్వర్ రెడ్డి ఆళ్ల నాగబాబు వేల్పుల శివ ముత్తవరపు ప్యారి చీదిరాళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య నగర్ గణపతిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు....



**మధిర సెప్టెంబర్ 19(సికె న్యూస్)ప్రతినిధి.** మధిర వినాయక చవితి సందర్భంగా మధిర పట్టణంలోని సుందరయ్య నగర్ లో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగా హనుమంతరావు, శివాలయం మాజీ చైర్మన్ పాతిబండ్ల సత్యంబాబు, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురాంశెట్టి కిషోర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కృష్ణాపురం గ్రామ మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు నెల్లూరు రాము స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు.

## తెలంగాణ విద్యార్థినీ విద్యార్థులారా అమ్మ పేరుతో మొక్క నాటు



**మధిర సెప్టెంబర్ 19(సికె న్యూస్)ప్రతినిధి.** తెలంగాణ విద్యార్థిని విద్యార్థులారా అమ్మ పేరుతో ఒక మొక్క నాటు కార్యక్రమాన్ని కృష్ణాపురం గ్రామంలోని యుపిఎస్ స్కూల్ నందు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో తెలంగాణ విద్యార్థిని విద్యార్థులారా అమ్మ పేరుతో మొక్క నాటు కార్యక్రమం పర్యావరణ పరిరక్షణలో ఎంతో దోహదపడుతుందని భావితరాలకు కాలుష్యరైత సమాజం ఏర్పాటు చేయడంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం గ్రామ సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు,మాజీ సర్పంచ్ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, ఉపసర్పంచ్ కొత్తపల్లి నరసింహారావు , గ్రామ శాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్రావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత ఉపాధ్యాయులు జ్యోతి, రఫీ, కొండలరావు, పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బూట్ లు, సాక్స్ ల పంపిణీ కార్యక్రమం నిర్వహణ



**మధిర సెప్టెంబర్ 19(సికె న్యూస్ )ప్రతినిధి.** మధిర మండలం ఖాజీపురం పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బూట్ లు, సాక్సుల పంపిణీ కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫామ్ లు కూడా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ శ్రీమతి ఆయేషా కమాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీ అక్మల్ , గ్రామ సెక్రెటరీ శ్రీమతి అర్చన , అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షులు శంషాద్ , గ్రామదీపిక నజ్మా , అంగన్వాడీ కార్యకర్త మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిక్షా రెడ్డి గారు,ఉపాధ్యాయులు సుజాత గారు మొదలగువారు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి చిన్నమండవ సర్పంచ్ పర్చ రామచంద్రరావు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపొందించడమే ఏకైక మార్గమని, వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ పర్చరామచంద్రరావు పిలుపునిచ్చారు... చిన్నమండవ ప్రాథమిక పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపొందించడమే ఏకైక మార్గమని, వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం

చిన్నమండవ పాఠశాలలో శనివారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలకు సకాలంలో నీరు అందించడం, రక్షణ కల్పించడం, వాటి ఎదుగుదలను పర్యవేక్షించడం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. మొక్క నాటితే బాధ్యత తీరినట్లు కాదని.. అది మహావృక్షంగా ఎదిగే వరకు కాపాడినప్పుడే వన మహోత్సవానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు

ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులు వన మహోత్సవంలో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద, పాఠశాల ఆవరణల్లో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రస్తుతం పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తంగిరాల మాధవి, వార్డ్ మెంబర్లు గుండ్ల బేబీ రాణి గుండ్ల భద్రమ్మ , పాఠశాల ఉపాధ్యాయులు జెట్టి రాంబాబు, రత్నకుమారి, అంజద్ ఖాన్ పూర్ణచంద్రరావు భూక్యా కిషన్ పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల ఆహారంతో ప్రభుత్వం ఆటలాడొద్దు.

**నాసిరకం సరుకుల ఆరోపణలపై సిట్ విచారణ జరపాలి: సర్పంచ్ చాపలమడుగు వీరబాబు.**

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార సరుకుల సరఫరాపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం, స్వేరోస్ నెట్‌వర్క్, భీమ్ వారియర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గురుకుల విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని వీరబాబు అన్నారు. ఆహార సరుకుల కొనుగోలు, సరఫరా విషయంలో పారదర్శకత ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ఎలాంటి ముప్పు కలగకుండా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కోరారు.

ప్రస్తుతం గురుకులాల ఆహార సరుకుల కొనుగోలును కేంద్రీకృత విధానంలో నిర్వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన తెలిపారు. +.ూ.వీం.చీశీ.17 ద్వారా గురుకులాల్లో ఆహార సరుకుల కొనుగోలు విధానంలో మార్పులు తీసుకొచ్చిన విషయం కోర్టు రికార్డుల్లోనూ నమోదైందని పేర్కొన్నారు. గతంలో జిల్లా స్థాయిలో కొనుగోలు జరిగే విధానానికి భిన్నంగా కొత్త విధానం రావడంతో చిన్నస్థాయి సరఫరాదారులు, స్థానిక కాంట్రాక్టర్లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు.

నేకాఫ్ సంస్థకు సంబంధించిన టెండర్ వ్యవహారంపై పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలని వీరబాబు డిమాండ్ చేశారు. సంస్థ అర్హత, సరఫరా నాణ్యత, ధరలు, టెండర్ ప్రక్రియ, గతంలో ఎదురైన వివాదాలు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నేకాఫ్ సంస్థను గతంలో బ్లాక్‌లిస్ట్ చేశారన్న ఆరోపణలపై కూడా అధికారిక రికార్డులను బహిర్గతం చేయాలని అన్నారు. ఈ అంశంపై న్యాయస్థానంలో గతంలో వివాదం నమోదైనప్పటికీ, బ్లాక్‌లిస్టింగ్ స్థితిపై భిన్నమైన వాదనలు ఉన్నట్లు కోర్టు రికార్డులు చూపిస్తున్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

గురుకుల విద్యార్థులకు అందించే పప్పులు, గోధుమపిండి, నూనె, పల్లీలు, చక్కెర, గుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ధరలు, టెండర్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటే దానిపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని కోరారు.

విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత లోపించిందనే ఫిర్యాదులు వస్తే వెంటనే నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలని, నివేదికలను తల్లిదండ్రులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు.







రూ.900 కోట్ల విలువైన గురుకుల ఆహార సరఫరా టెండర్లపై వస్తున్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని వీరబాబు డిమాండ్ చేశారు. అవసరమైతే సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. టెండర్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్లు, అర్హతలు, ధరల వివరాలు, సరఫరా ఒప్పందాలు, నాణ్యత పరీక్షల నివేదికలు తదితర సమాచారాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయాలని అన్నారు.

గురుకుల విద్యార్థులు పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలని, వారి ఆహారం విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నాణ్యమైన ఆహారం అందించకపోతే తల్లిదండ్రులతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వీరబాబు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్, కో-కన్వీనర్ కంకణాల శ్రీనాథ్, సీనియర్ స్వేరోస్ నాయకులు దామెర్ల పృథ్వీరాజ్, బక్క వెంకటేశ్వర్లు, గురుకుల తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారపోగు నాగయ్య, పాలేరు స్వేరోస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కొండు రామచంద్రు, మధిర ఇన్‌చార్జి సోలెపోగు శ్యాంసుందర్, ఎస్ఎంఎస్ హాస్టల్స్ జిల్లా నాయకులు సాయి, ప్రేమ్‌కుమార్, బహుజన నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగాఎల్బీ స్టేడియము “ఖేలో గణేశా “నిమజ్జనం



సి కె న్యూస్ ప్రతినిది హైదరాబాద్:తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ‘ఖేలో గణేశా’ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం శనివారం ఉద్యోగుల సందడి, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, కోచ్‌లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సవాల మధ్య వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డు వేలం పాటలో ఉద్యోగి వెంకటేష్ ?41,116లకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, కోచ్‌లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.. సర్పంచ్ చాపల మడుగు వీరబాబు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలం తిరుమలాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటలకు పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టు ఎంతో అవసరమని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడటం, తమను తాము పరిచయం చేసుకోవడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.పేరెంట్స్ మీటింగ్‌లో విద్యార్థులను ఒక్కొక్కరిని పిలిచి సెల్ఫ్ ఇంట్రడక్షన్, నెలలు, పండుగలు, రాష్ట్రాలు తదితర అంశాలపై ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, మరింత ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అలాగే పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సమక్షంలో సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, దీపిక దంపతుల కుమారుడు చాపలమడుగు రేవంత్ చేతుల మీదుగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.విద్యార్థుల చదువు, ప్రగతిపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని సర్పంచ్ సూచించారు. తమ పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారు, ఏయే అంశాల్లో ప్రతిభ చూపుతున్నారు, ఎక్కడ వెనుకబడి ఉన్నారో తల్లిదండ్రులు తెలుసుకోవాలని అన్నారు. పాఠశాల నుంచి అందించే ప్రోగ్రెస్ కార్డులను ప్రతి తల్లిదండ్రులు పరిశీలించి, అన్ని సబ్జెక్టుల్లో పిల్లల ప్రగతిని తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా వినడంతో పాటు ఇంటి వద్ద కూడా పునశ్చరణ చేయాలని అన్నారు. రోజువారీ జీవితంలో తమకు తెలిసిన ఇంగ్లీష్ పదాలను ఉపయోగిస్తూ ఇంగ్లీష్‌లో మాట్లాడే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలు, పోటీ పరీక్షలకు అవసరమైన సామర్థ్యాలను కూడా విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తన ప్రతిభను చాటుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి తిరుమలాపురం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్వాతి మేడం ఉపాధ్యాయులు, ప్రీతం అంగన్వాడి టీచర్ నాగ సీతారత్నం, గ్రామ సెక్రెటరీ కొండపల్లి ఉమారాణి, 4వార్డు సభ్యులు చాపలమడుగు మధు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భూమిలోకి చొరబడి పంటను ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి., సెప్టెంబర్ 19:-చింతకాని గ్రామానికి చెందిన నారపోగు వెంకటరామమ్మ (55) తనకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో సాగు చేసుకుంటున్న పంటను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. 2016లో తెలంగాణ ప్రభుత్వం గ్రామ శివారులో తొమ్మిది మందికి భూమిని కేటాయించిందని, అందులో తాను వరి నాటు వేసుకుని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం కొందరు వ్యక్తులు తన పొలంలోకి ప్రవేశించి పొలాన్ని దున్ని పంటను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. దీంతో సుమారు రూ.95 వేల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు.తమను అడ్డుకున్న సమయంలో నిందితులు మందు డబ్బాలు చూపించి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై చింతకాని ఎస్ఐ జి. నరేష్ వివరాలు వెల్లడిస్తూ, ఫిర్యాదు మేరకు 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గొట్లపల్లిలో పంచాయతీ చెల్లింపులపై విచారణ

- **ఫిర్యాదు మేరకు గ్రామపంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంపీఓ రతన్ సింగ్**



సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 19:పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లి గ్రామపంచాయతీలో గతంలో జరిగినట్లు పేర్కొంటున్న కొన్ని బిల్లుల చెల్లింపులపై ఫిర్యాదు అందడంతో శనివారం పెద్దేముల్ మండల ఎంపీఓ రతన్ సింగ్ గ్రామపంచాయతీని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామానికి చెందిన బి.నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు ఈ పరిశీలన చేపట్టినట్లు ఎంపీఓ తెలిపారు.2023--24, 2026--27 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పంచాయతీ రికార్డుల్లో గతంలో గొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన పంచాయతీ కార్యదర్శి రాజు భార్య పేరుపై చెల్లింపులు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అదేవిధంగా ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పరమేష్ కూడా మాజీ పంచాయతీ కార్యదర్శి భార్య పేరుపై చెల్లింపులు చేసినట్లు గొట్లపల్లి గ్రామానికి చెందిన బీ.నవీన్ కుమార్ ఆరోపించారు.ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి,నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బి.నవీన్ కుమార్ అధికారులను కోరారు.ఫిర్యాదు నేపథ్యంలో ఎంపీఓ రతన్ సింగ్ గొట్లపల్లి గ్రామపంచాయతీని సందర్శించి సంబంధిత రికార్డులు, చెల్లింపులకు సంబంధించిన రికార్డులను,వివరాలను పరిశీలించారు.పరిశీలన అనంతరం తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఎంపీఓ తెలిపారు.

అధికారుల నివేదిక అనంతరం చెల్లింపులకు సంబంధించిన వాస్తవాలు, నిబంధనల అమలు తదితర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఓయాసిస్ స్కూల్లో కరాటే పోటీల్లో సత్తా చాటిన పెండ్లి మడుగు సిస్టర్స్




షాద్నగర్ నియోజకవర్గ కొత్తూర్ సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 19: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలోని ప్రముఖ విద్యా సంస్థ ఓయాసిస్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం పాఠశాల స్థాయి కరాటే పోటీలు అత్యంత ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించగా, పాఠశాలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ పోటీల్లో కొత్తూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన ఇద్దరువిద్యార్థినులు,అద్భుతంగా రాణించి పతకాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారు. ఎల్లో బెల్ట్ విభాగంలో భవ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకోగా, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో నిశ్రుత విజేతగా నిలిచి తన సత్తాను చాటింది. వీరిద్దరూ ప్రదర్శించిన చురుకైన,కదలికలు,అద్భుత కిక్స్ తోఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను, న్యాయ నిర్ణేతలను ఆకట్టుకున్నారు.

అనంతరం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో విజేతలైన విద్యార్థినులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి కరాటే పోటీల్లో విజయం సాధించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని, తమను నిత్యం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి, కరాటే మాస్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రస్తుత కాలంలో బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే వంటి విద్యలు నేర్చుకోవడం ఎంతో అవసరమని, కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరగడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని కరాటే మాస్టర్ తెలిపారు. విజేతలైన భవ్యశ్రీ, నిశ్రుత లను గూడూరు గ్రామస్తులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

## ఇందూరులో డీజే నిర్వాహకుడి దురుసు ప్రవర్తన..కేసు నమోదు

- **ఆటోతో గుద్ది చంపుతానంటూ పోలీసులకు బెదిరింపులు**
- **ఇందూరులో వినాయక నిమజ్జన బందోబస్తు సందర్భంగా ఘటన**
- **అనుమతి లేని డీజే నిర్వహణపై చర్యలు**
- **పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్**

సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 19

వినాయక నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని అడ్డుకుని, బెదిరింపులకు పాల్పడిన డీజే నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు సిబ్బందిని బలవంతంగా పక్కకు నెట్టివేసి డీజే ఆటోతో అక్కడి నుంచి వెళ్లిపోయిన ఘటన పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామంలో చోటుచేసుకుంది.ఈ ఘటనకు సంబంధించి పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.........

ఈ నెల 18వ తేదీ శుక్రవారం రాత్రి ఇందూరు గ్రామంలో వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనాథ్ (హెచ్‌సీ 3181), కానిస్టేబుల్ జగన్ బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.అదే గ్రామానికి చెందిన డీజే సౌండ్ సిస్టమ్ యజమాని బాబా హుస్సేన్ నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ బాక్సులను నిమజ్జన ఊరేగింపు వద్దకు తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు.డీజే వినియోగానికి అనుమతి లేదని పోలీసులు సూచించడంతో నిర్వాహకులు డీజేను పక్కనపెట్టి బ్యాండ్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే 19వ తేదీ ఉదయం బాబా హుస్సేన్ తిరిగి అదే ప్రాంతంలో డీజేను ఏర్పాటు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది దీనిని ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించి,డీజే ఆటోను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను బెదిరించినట్లు తెలిపారు.

**“ఆటోతో గుద్ది చంపుతా” అంటూ బెదిరింపు**

డీజే ఆటోను తరలించకుండా పోలీసులు అడ్డుకోగా.. “పక్కకు తప్పుకోకపోతే ఆటోతో గుద్ది చంపుతాను” అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.అనంతరం విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని బలవంతంగా పక్కకు నెట్టివేసి,డీజే ఆటోతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.హెడ్ కానిస్టేబుల్ శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాబా హుస్సేన్‌పై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**


ఉత్సవాలు,వినాయక నిమజ్జనాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ సూచించారు. అనుమతి లేని డీజేలు, అధిక శబ్ద పరికరాలను వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా,విధుల్లో ఉన్న సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించినా ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని పెద్దేముల్ ఎస్ఐ స్పష్టం చేశారు.

# తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్ర

## మూడో రోజు కొనసాగిన పాదయాత్ర

### శంషాబాద్ నుంచి నందిగామ వరకు





- రెడ్లు, వెలమలతో బీసీలకు సోపతి ఒద్దు
- 80 ఏండ్ల దోపిడిని ప్రతి ఇంటికి వివరిస్తా
- 2028లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను ఖతం చేస్తా
- తెలంగాణలో బీసీ రాజ్యాధికారమే ఏకైక మార్గం...
- మన బతుకులు మారాలంటే 'కత్తెర' గుర్తుతోనే సాధ్యం
- ఇల్లు లేక రోడ్లున పడ్డ నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటా

## ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. మల్లన్న పాదయాత్ర



**సి కె న్యూస్ ప్రతినిధి హైదరాబాద్/రంగారెడ్డి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన 'బీసీ రాజ్యాధికార యాత్ర' మూడో రోజు శనివారం శంషాబాద్ నుంచి నందిగామ వరకు కొనసాగింది. పార్టీ కార్యకర్తలు, బీసీ శ్రేణులు ఆయన వెంట పాదయాత్రలో పాల్గొన్నారు. దారిపొడవునా ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ మల్లన్న ముందుకు సాగారు.

**ఆర్టీసీ ఎన్నికల్లో బహుజన వర్కర్స్ యూనియన్‌ను గెలిపించాలి**

పాదయాత్రలో భాగంగా మార్గమధ్యంలో ఆర్టీసీ కార్మికులతో మల్లన్న ముచ్చటించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగపరమైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాబోయే ఆర్టీసీ కార్మిక సంఘ ఎన్నికలను ప్రస్తావించిన ఆయన.. తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ సంస్థ బహుజన వర్కర్స్ యూనియన్ (బీడబ్ల్యూయూ) ను గెలిపించాలని కార్మికులను కోరారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం బహుజన వర్కర్స్ యూనియన్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

**బుడగ జంగాల కుటుంబాలకు భరోసా**

ఇళ్లు లేక, ప్రభుత్వం నుంచి సరైన సాయం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బుడగ జంగాల కుటుంబాలను మల్లన్న పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బీసీల బతుకులు మారాలంటే రాజ్యం మన చేతుల్లోకి రావాలని అప్పుడే ప్రతి బీసీ కుటుంబానికి ఇల్లు,భూమి దక్కుతుందని అన్నారు. దారిపొడవునా ఎదురైన వృద్ధులు, మహిళలను పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు.

**'కత్తెరే మన రాజకీయ ఆయుధం కావాలి'**

శంషాబాద్ నుంచి పాలమాకుల వెళ్లే మార్గంలో ఓ పంచర్ షాప్ నిర్వాహకుడితో మల్లన్న ప్రత్యేకంగా ముచ్చటించారు. అతని జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల గుర్తు 'కత్తెర'ను ప్రస్తావిస్తూ.. "నీ బతుకు బండి నడపడానికి రోజూ కత్తెరను ఉపయోగిస్తున్నావు. మన బిడ్డల భవిష్యత్తు మారాలంటే, మన బతుకులు బాగుపడాలంటే ఇకపై కత్తెరే మన రాజకీయ ఆయుధం కావాలి" అని పిలుపునిచ్చారు.

**'బీసీలకు రాజ్యాధికారం రావాలి'**

యాత్రలో మల్లన్న మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదన్నారు. గత 80 ఏళ్లుగా రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాల చేతుల్లోనే అధికారం కేంద్రీకృతమైందని అన్నారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలు రాజకీయంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

"మన బతుకులు మారాలన్నా.. మన హక్కులు మనకు దక్కాలన్నా తెలంగాణలో బీసీ రాజ్యాధికారం రావాలి. బీసీలు రాజకీయంగా చైతన్యవంతులై తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు రావాలి" అని మల్లన్న పిలుపునిచ్చారు. మూడో రోజు యాత్రలో పలు ప్రాంతాల్లో ప్రజలు మల్లన్నను కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, హక్కులపై చైతన్యం కల్పిస్తూ 'బీసీ రాజ్యాధికార యాత్ర' కొనసాగుతుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్గాలు తెలిపాయి.

తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర నాలుగో రోజు ఆదివారం కొనసాగనుంది. నాలుగో రోజు యాత్ర నందిగామ నుంచి ప్రారంభమై షాద్‌నగర్, ఎలికట్టె మీదుగా మొగిలిగిద్ద వరకు సాగనుంది. యాత్రలో భాగంగా మార్గమధ్యంలోని పట్టణాల్లో ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ మల్లన్న ముందుకు సాగనున్నారు.

బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి అవకాశాలతో పాటు రాజకీయంగా బీసీలను చైతన్యపరిచి బీసీ రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతోంది.



